ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

శంకర్ (ఫైల్)

దామెర, సెప్టెంబర్ 10 : మండల కేంద్రానికి చెందిన వేల్పుల శంకర్ (50) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. శంకర్ గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. గత నెల 28న ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రైలు పట్టాలు కొట్టుకుపోయిన ఘటనపై విచారణ?

కాజీపేట, సెప్టెంబర్ 10 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కేసముద్రం– ఇంటికన్నె– తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలు కొట్టుకుపోయిన ఘటనపై రైల్వే శాఖ విచారణ చేపట్టింది. విచారణలో భారీ వరద ఒకేసారి రావడంపై ఆరా తీసింది. రైల్వేశాఖ ఈ ఏడాది రైల్వే ఎఫెక్ట్ ట్యాంక్స్‌పై సర్వే చేపట్టి 100 ఆర్ఏటీ చెరువులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖకు అప్పగించింది. వాటికి మరమ్మతులు చేపట్టలేదని రైల్వే శాఖ భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పాటు ఈ సెక్షన్‌లో జరుగుతున్న మూడోలైన్ కోసం పోసిన కంకర కుప్పలూ రైలు పట్టాల కింద కంకర కొట్టుకుపోవడానికి కారణంగా భావిస్తున్నట్లు తెలిసింది. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

దొంగ అరెస్టు

నయీంనగర్, సెప్టెంబర్ 10 : జల్సాలకు అలవాటు పడి దొంగతనం చేసిన వ్యక్తిని సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. విశాఖపట్నం అనకాపల్లిలోని విజయ రామారావుపేటకు చెందిన ఎల్లపు సాయికుమార్ బాలసముద్రంలోని వృద్ధులకు కేర్‌టేకర్‌గా పని చేసేవాడు. ఈ నెల 7న రాత్రి ఆ ఇంట్లో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, స్మార్ట్ ఫోన్, కీ ప్యాడ్ ఫోన్, కారు తాళం, ఆంధ్రాబ్యాంక్ ఏటీఎంలను దొంగిలించి వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. బాధితుల ఫిర్యాదుతో ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం అదాలత్ జంక్షన్‌లో వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి అతడు పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఏఎస్సై పాపయ్య, కానిస్టేబుల్ లియాఖత్ అలీని ఆయన అభినందించారు.

కేయూ భూములపై విజిలెన్స్ అధికారుల సర్వే

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 10 : కాకతీయ యూనివర్సిటీ భూములపై విజిలెన్స్ అధికారులు సర్వే నిర్వహించారు. వర్సిటీ భూములు కబ్జాకు గురికావడంతో వర్సిటీ అధికారులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భూముల పరిరక్షణకు మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి విచారణ చేపట్టారు. ఆక్రమణకు గురైన యూనివర్సిటీ భూముల లెక్కతేల్చేందుకు అధికారులు పలివేల్పుల, లష్కర్‌సింగారం భూముల సర్వే నంబర్ 229లో గుండ్లసింగారం సమీపంలోని ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానుల భూమి పత్రాలను పరిశీలించారు. అధికారులు తెచ్చుకున్న డిజిటలైజేషన్ సర్వే మ్యాప్ ద్వారా విచారణ కొనసాగించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ మాట్లాడుతూ.. కాకతీయ యూనివర్సిటీ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించామని, ఇందులో 6 ఎకరాల 15 గుంటల మొత్తం భూమి ఉందన్నారు. త్వరలోనే మిగతా సర్వే నంబర్లల్లోనూ విచారణ చేపడతామని చెప్పారు. సమగ్ర విచారణ చేపట్టాలని బీఆర్ఎస్వీ సంఘం నాయకులు బైరపాక ప్రశాంత్, మాచర్ల శరత్‌చంద్ర రాకేశ్‌కు వినతిపత్రం అందజేశారు.

తెలంగాణ పోరాట అస్తిత్వం ఐలమ్మ

- మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయురాలు
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా ఐలమ్మ 39వ వర్ధంతి

ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్, చిత్రంలో ఎంపీ కావ్య, కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

హనుమకొండలోని తన నివాసంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

హనుమకొండ/న్యూశాయంపేట, సెప్టెంబర్ 10 : తెలంగాణ పోరాట అస్తిత్వం చాకలి ఐలమ్మ అని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. మంగళవారం ఆమె 39వ వర్ధంతి సందర్భంగా హనుమకొండ హంటర్‌రోడ్డులోని విగ్రహానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదతో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. అలాగే బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్యాయాన్ని ఎదురించిన వీర వనిత, భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయురాలు ఐలమ్మ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ హయాంలో మహనీయుల జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించినట్లు తెలిపారు. కడియం కావ్య మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు, భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయురాలు ఐలమ్మ అన్నారు. మహిళా చైతన్యానికి, సాధికారతకు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని అభివర్ణించారు.ఆయా కార్యక్రమాల్లో కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు చెన్నం మధు, బొంగు అశోక్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు సాంబారి సమ్మారావు, పోలపల్లి రామ్మూర్తి, వెంకన్న, మిట్టపల్లి రమేశ్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం..

-మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి రూరల్ : చాకలి ఐలమ్మ భూ పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆమె వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండలోని తన నివాసంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రజాకార్లను ఎదురించిన ధీశాలి, విస్నూరు దేశ్ ముఖ్ ఆగడాలను అడ్డుకున వీరవనిత ఐలమ్మ అన్నారు. ఓ వైపు సాయుధ పోరాటం చేస్తూనే మరో వైపు కమ్యూనిస్టు ఉద్యమకారులకు అన్నం పెట్టి కాపాడిన మహనీయురాలన్నారు.

డబ్బులు 'డబుల్' చేస్తామంటూ
పలువురికి ఓ కంపెనీ టోకరా..

- సుమారు 30 మంది నుంచి రూ.30 లక్షల వసూలు
- ఇప్పుడు ముఖం చాటేయడంతో బాధితుల గగ్గోలు
- చెల్లించిన డబ్బులు తిరిగి రావడం లేదని ఆగిన వృద్ధుడి గుండె
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఐనవోలు, సెప్టెంబర్ 10 : ఒకటికి నాలుగింతలు లాభాలు వస్తాయని నమ్మించి ఓ ప్రైవేట్ కంపెనీ యాజమాన్యం పలువురిని నిండా ముంచింది. గడువు తీరినా చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఓ వృద్ధుడి గుండె ఆగిపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన పెంతల బుచ్చిరెడ్డి(68), కొమురమ్మ దంపతులు 'మహర్ష' ప్రైవేట్ కంపెనీలో ఆరు సంవత్సరాలు డబ్బులు జమ చేస్తే మరో సంవత్సరం తర్వాత డబుల్ వస్తాయని అదే గ్రామానికి చెందిన ఆ సంస్థ ఏజెంట్ నమ్మబలికాడు. ఏజెంట్ చెప్పిన మాటలు నమ్మి బుచ్చిరెడ్డి 2017 నుంచి 2023 వరకు ప్రతి ఏటా రూ.41,040 చొప్పున రూ.2,59,200 చెల్లించాడు. ఏజెంట్ రూ.4,04,460 వస్తాయని చెప్పాడు. పెంతల కొమురమ్మ 2017 నుంచి 2023 వరకు ప్రతి ఏటా రూ. 30,780 చొప్పున రూ.1,94,400 చెల్లించగా ఏజెంట్ రూ.3,03,345 వస్తాయన్నాడు. ఇద్దరికి కంపెనీ నుంచి రూ. 7 లక్షలకు పైగా రావాల్సి ఉంది. కానీ మెచ్యూరిటీ పూర్తయి సంవత్సరం దాటినా డబ్బులు తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన బుచ్చిరెడ్డి ఆగస్టు 23న గుండెపోటుతో మృతి చెందాడు. వారితో పాటు గ్రామంలో సుమారు 30 మంది రూ.30 లక్షల వరకు చెల్లించారు. కాగా, సదరు ఏజెంట్‌ను మంగళవారం బాధితులు కలిసి అడిగితే వారు చెల్లించిన డబ్బులతో తనకు ఎటువంటి సంబంధం లేదని, ఆడబ్బులు తాను కంపెనీకి చెల్లించానని, కంపెనీ మేనేజర్‌ను పిలిపిస్తానని మాట మార్చిన్నట్లు పేర్కొన్నారు. కష్టపడి కట్టిన డబ్బులు తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు. బుధవారం బాధితులు పోలీసులను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

ఉప్పల్ స్టేషన్ అప్‌గ్రేడ్ చేయాలని వినతి

కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లేఖ ఇస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కమలాపూర్, సెప్టెంబర్ 10 : మండలంలోని ఉప్పల్ రైల్వే స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, హసన్‌పర్తి–కరీంనగర్ కొత్త రైల్వేలైన్ నిర్మాణం, జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ ఆపాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఢిల్లీలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి నాలుగు జిల్లాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, సెప్టెంబర్ 10 : హనుమకొండ టౌన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లైన్ టవర్ల కన్‌స్ట్రక్షన్ చేస్తున్నామని, కాకాజీ కాలనీ, హనుమకొండ చౌరస్తా, బస్‌స్టేషన్ రోడ్డు, అలంకార్ జంక్షన్, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పేదల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ఐనవోలు/హసన్‌పర్తి, సెప్టెంబర్ 10 : పేదలను అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. ఐనవోలులోని మల్లికార్జున గార్డెన్‌లో 91మందికి రూ.91.10లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, 70 మందికి రూ.18.95లక్షల వేల విలువైన చెక్కులను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి, హసన్‌పర్తిలోని ఎర్రగట్టుగుట్ట కల్యాణ మండపంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు 152 మందికి రూ.1.52కోట్ల విలువైన చెక్కులు, అలాగే 110మందికి రూ.32.28లక్షల విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక కేంద్రాన్ని త్వరలో 24 గంటల వైద్య సౌకర్యం అందుబాటులోకి తీసుకువస్తానన్నారు. పున్నేల్ క్రాస్ నుంచి ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానం వరకు నాలుగు లైన్ల రోడ్డును మంజూరు చేయించాలని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ఎమ్మెల్యేను కోరారు. తహసీల్దార్ విక్రమ్ కుమార్, డీటీ అనిల్‌కుమార్, ఆర్ఐలు మల్లయ్య, రాణి, 55 డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజితావెంకటేశ్వర్లు, కాంగ్రెస్ 66 డివిజన్ అధ్యక్షుడు కనిపర్తి కిరణ్, మండలాధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, వెంకటస్వామి, నర్సింహరాములు పాల్గొన్నారు.

ఐనవోలు : లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

12న స్పాట్ అడ్మిషన్లు

మడికొండ, సెప్టెంబర్ 10 : వరంగల్ రీజియన్ పరిధిలోని (హనుమకొండ, వరంగల్, ములుగు, భూపాలపల్లి) జిల్లాల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలల్లో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఈ నెల 12న మడికొండలోని బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు, తల్లిదండ్రులు కులం, ఆదాయం, నివాసం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్స్ వెంట తీసుకొని రావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించి కౌన్సెలింగ్ చేపడుతామన్నారు. వివరాలకు 9949892426, 7680906134 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తొలి ప్రైవేట్ స్పేస్‌వాక్

నలుగురు వ్యోమగాములను నింగిలోకి పంపిన 'స్పేస్ ఎక్స్'

కేప్ కెనావెరల్, సెప్టెంబర్ 10: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఖగోళ పరిశోధనా సంస్థ 'స్పేస్ ఎక్స్' సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమైంది. అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్ నిర్వహించేందుకు 'పొలారిస్ డాన్' ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములను 'ఫాల్కన్–9' రాకెట్ ద్వారా రోదసిలోకి పంపింది. ప్రముఖ బిలియనీర్ జేర్డ్ ఇసాక్‌మన్, 'స్పేస్ ఎక్స్' ఇంజినీర్లు సారా గిల్లీ, అన్నా మెనోన్, అమెరికా వైమానికదళ మాజీ పైలట్ స్కాట్ కిడ్‌తో కూడిన ఈ రాకెట్ మంగళవారం తెల్లవారుజామున ఫ్లోరిడాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. 'పొలారిస్' ప్రాజెక్టులో చేపట్టే మూడు మానవసహిత రోదసి యాత్రల్లో ఇదే మొదటిది. ఈ యాత్ర అనుకున్నట్టుగా సాగితే బుధవారం లేదా గురువారం వారు స్పేస్‌వాక్ నిర్వహిస్తారు.

మహారాష్ట్రలో ఎన్నికల వేడి

- దీపావళి తర్వాత ఎన్నికలకు అవకాశం
- కసరత్తు ప్రారంభించిన ఎన్నికల సంఘం
- మహాయుతి వర్సెస్ మహా వికాస్ అఘాడీ
- రెండు కూటముల మధ్య హోరాహోరీ
- తేలనున్న శివసేన, ఎన్సీపీ భవిష్యత్తు
- సర్వేల్లో మహా వికాస్ అఘాడీకి మొగ్గు

ముంబై, సెప్టెంబర్ 10 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల హీట్ మొదలైంది. దీపావళి తర్వాత రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 13న జిల్లాల కలెక్టర్లతో ఈసీ సమీక్ష నిర్వహించనుంది. కాగా, అధికారాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంతో బీజేపీ, శివసేన(షిండే), ఎన్సీపీ(అజిత్)తో కూడిన మహాయుతి కూటమి ఎన్నికల బరిలో దిగుతున్నది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన జోష్‌ను కొనసాగించి రాష్ట్రంలో అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్, శివసేన(ఠాక్రే), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ ప్రయత్నిస్తున్నది. దీంతో రెండు కూటముల మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నది. ఈ ఎన్నికలు రాష్ట్రంలో అధికారం ఎవరిదో నిర్ణయించడంతో పాటు శివసేన, ఎన్సీపీల భవిష్యత్తును కూడా తేల్చేయనున్నాయి. ఈ నేపథ్యంలో రెండు కూటములకు ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారాయి.

ఏ ప్రాంతంలో ఎవరిది హవా?

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటికే సర్వేల జోరు మొదలయ్యింది. అయితే, పలు ప్రాంతాల్లో మహాయుతి, ఇంకొన్ని ప్రాంతాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు సర్వేలు చెప్తున్నాయి. విదర్భలోని 62 సీట్లలో మహా వికాస్ అఘాడీ అధిపత్యం ఉంటుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. ఖాందేష్‌లోని 47 సీట్లలో రెండు కూటములకు సమానంగా విజయావకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కంచుకోట అయిన ఠాణేతో పాటు కొంకణ్ బెల్ట్‌లోని 39 సీట్లలో మాత్రం మహాయుతి కూటమికి మొగ్గు కనిపిస్తున్నట్టు చెప్తున్నారు. ఠాణేలో షిండే వైపు నిలుస్తున్న మరాఠా ఓటర్లు ముంబైలో మాత్రం ఉద్ధవ్ ఠాక్రేకు అనుకూలంగా ఉన్నారని, ముంబై బెల్ట్‌లోని 36 నియోజకవర్గాల్లో మహాయుతిపై మహా వికాస్ అఘాడీకి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పవార్ కుటుంబానికి పట్టున్న పశ్చిమ మహారాష్ట్రలోని 58 సీట్లతో పాటు, మరాఠ్వాడాలోని 46 స్థానాల్లో మహా వికాస్ అఘాడీకి సానుకూలత ఉన్నట్టు చెప్తున్నారు. మహాయుతి కంటే మహా వికాస్ అఘాడీకే రాష్ట్రంలో మొగ్గు కనిపిస్తున్నదని లోక్ పోల్ సర్వే పేర్కొన్నది.

లోక్‌సభ ఫలితాలు రిపీట్ అవుతాయా?

మహారాష్ట్రలో లోక్‌సభ ఎన్నికల్లో మహాయుతి కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కూటమి కేవలం 17 సీట్లతో సరిపెట్టుకోగా, మహా వికాస్ అఘాడీ 30 సీట్లు గెలుచుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత, శాంతిభద్రతలు దెబ్బతినడం, అధిక ధరలు, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలడం, మరాఠాల రిజర్వేషన్ల ఉద్యమం, నిరుద్యోగం, మహారాష్ట్ర నుంచి పలు ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లిపోవడం వంటి అంశాలు మహాయుతి కూటమికి వ్యతిరేకంగా మారాయి. మరోవైపు మూడు పార్టీల మధ్య సమన్వయలేమి, సీట్ల పంపకాలు, సీఎం అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోలేకపోవడం వంటి అంశాలు మహా వికాస్ అఘాడీకి ప్రతికూలంగా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కేదార్‌నాథ్ మార్గంలో విరిగిన కొండచరియలు
ఐదుగురి మృతి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కేదార్‌నాథ్ వెళ్లే మార్గంలో భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున కొండచరియలు విరిగిపడగా, ఐదుగురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం రాత్రి కేదార్‌నాథ్ జాతీయ రహదారిపై సోన్‌ప్రయాగ, గౌరీకుండ్ మధ్య ఈ ఘటన చోటుచేసుకున్నది. కేంద్ర, రాష్ట్ర విపత్తు సహాయక బృందాలు అక్కడికి చేరుకొని, ఘటనాస్థలం నుంచి ఐదు మృతదేహాల్ని వెలికితీసినట్టు రుద్రప్రయాగ్ విపత్తు నిర్వహణ అధికారి నందన్ సింగ్ రాజ్వార్ చెప్పారు. శిథిలాల కింద మరికొంత మంది యాత్రికులు చిక్కుకుపోయి ఉండొచ్చునని పోలీసులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో వైష్ణో దేవి ఆలయాన్ని చేరుకునేందుకు కొత్తగా ఏర్పాటుచేసిన మార్గంలో సోమవారం కొండచరియలు విరిగిపడి ఇద్దరు మహిళా యాత్రికులు చనిపోయారు.

5 వేల సైబర్ కమెండోలు.. ఆన్‌లైన్ రిజిస్ట్రీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: సైబర్ భద్రతను మరింత పటిష్ఠం చేయడం కోసం కేంద్రం కీలక చర్యలు ప్రకటించింది. 5 వేల మంది సైబర్ కమెండోల నియామకం, వెబ్ ఆధారిత డాటా రిజిస్ట్రీ, సైబర్ నేరాల సమాచారం పంచుకొనే పోర్టల్, జాతీయ అనుమానితుల రిజిస్ట్రీని ఏర్పాటు చేయనున్నట్టు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. సైబర్ నేరాలకు హద్దులు లేవని.. సైబర్ భద్రత లేకుండా జాతీయ భద్రత అసాధ్యమని అన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన భారత సైబర్ నేరాల సహకార కేంద్రం(ఐ4సి) మొదటి వ్యవస్థాపక దినోత్సవంలో అమిత్ షా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన సంబంధిత సంస్థల ప్రతినిధులతో సైబర్ నేరాల తగ్గింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

మహిళా అధికారిపై వింగ్ కమాండర్ లైంగిక దాడి!

- కేసు నమోదు చేసిన పోలీసులు
- విచారణకు ఆదేశించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: భారత వైమానిక దళంలోని ఉన్నత అధికారిపై అత్యాచారం ఆరోపణలు జమ్ముకశ్మీర్‌లో సంచలనం సృష్టించాయి. జమ్ముకశ్మీర్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్ వింగ్ కమాండర్ తనపై లైంగిక దాడి చేయడమే కాక, మానసికంగా వేధిస్తున్నాడని మహిళా ఫ్లయింగ్ అధికారి ఆరోపించారు. ఆమె ఫిర్యాదు మేరకు ఐఏఎఫ్ అంతర్గత విచారణకు ఆదేశించింది. జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం పోలీసు స్టేషన్‌లో వింగ్ కమాండర్‌పై కేసు నమోదు చేశారు. బాధితురాలి కథనం ప్రకారం ఈ ఘటన 2023, డిసెంబర్ 31న న్యూఇయర్ వేడుకల్లో జరిగింది. ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగిన పార్టీలో ఆ అధికారి తన గదిలో లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించారు.

తోడేళ్ల భరతం పడుతున్నారు

ఉత్తర ప్రదేశ్‌లోని భరూచ్‌లో మనుషుల ప్రాణాలను హరిస్తున్న తోడేళ్ల వేట కొనసాగుతున్నది. అటవీ శాఖ అధికారులు స్థానికుల సహాయంతో మంగళవారం వలపన్ని ఒక తోడేలును ఇలా బంధించారు. మిగతా వాటి కోసం వేట కొనసాగుతోంది.

'సిద్ధ' ఔషధాలతో బాలికల్లో రక్తహీనత తగ్గుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10: కొన్ని 'సిద్ధ' ఔషధాల కాంబినేషన్‌తో కిశోర బాలికల్లో రక్తహీనతను తగ్గిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ట్రెడిషనల్ నాలెడ్జ్‌లో ఇది ప్రచురితమైంది. కేంద్ర ఆయుష్ శాఖ ప్రకటన ప్రకారం.. ఏబీఎంఎన్(అన్నపెటిక్‌సెంచురమ్, బావన కటుక్కాయ్, మతులై మనప్పకు, నెల్లికాయ్ లేహ్యం) మిశ్రమంతో కూడిన సిద్ధ ఔషధం హిమోగ్లోబిన్ స్థాయిలను, రక్త కణాల శాతాన్ని పెంచుతుందని కనుగొన్నారు. శరీరంలో నులి పురుగులు తొలగించిన 2300 కిశోర బాలికలపై 45 రోజులపాటు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఈ బాలికల్లో రక్త హీనత లక్షణాలైన అయాసం, జుట్టు ఊడిపోవడం, తల నొప్పి, రుతుక్రమ అసమతుల్యత తగ్గినట్టు కనుగొన్నారు. జాతీయ సిద్ధ సంస్థ, తమిళనాడులోని గ్జేవియర్ రిసెర్చ్ ఫౌండేషన్, వెలుమైలు సిద్ధ వైద్య కళాశాల, దవాఖాన తదితర సంస్థలు ఈ అధ్యయనంలో పాల్గొన్నాయి.

సమాన అవకాశాలు ఉంటే
రిజర్వేషన్లు రద్దు
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ వ్యాఖ్య

వాషింగ్టన్, సెప్టెంబర్ 10: అందరికీ సమానమైన అవకాశాలు ఉన్నప్పుడు రిజర్వేషన్లు రద్దు చేయడం గురించి ఆలోచిస్తామని, ఇప్పుడు భారత్‌లో అందరికీ సమాన అవకాశాలు లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్‌లోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీ విద్యార్థులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల జనాభా 90 శాతం ఉందని, కానీ దేశంలోని మొదటి 200 వ్యాపారుల్లో, అత్యున్నత న్యాయస్థానాల్లో, మీడియాలో వీరి భాగస్వామ్యం దాదాపు శూన్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంలో 78 మంది కార్యదర్శులు ఉంటే వీరిలో ఒకే ఒక్క గిరిజనుడు, ముగ్గురు దళితులు, ముగ్గురు ఓబీసీలు, ఒక్క మైనారిటీ మాత్రమే ఉన్నారని అన్నారు. కులగణన ద్వారానే దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల స్థితిగతులు తెలుస్తాయని పేర్కొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై వివాదం

వర్జీనియాలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదంగా మారాయి. 'ఇవాళ భారత్‌లో పోరాటం రాజకీయాల కోసం కాదు. ఒక సిక్కు టర్బన్ ధరించి, గురుద్వారాకు వెళ్లడానికి అనుమతిస్తారా అనే దానిపై పోరాటం జరుగుతున్నది. అన్ని మతాల కోసం జరుగుతున్న పోరాటం ఇది' అని రాహుల్ వ్యాఖ